కాంగ్రెస్‌కు ఆటో పారిశుద్ధ్య కార్మికుల మద్దతు



కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన ఆటో–రిక్షా పారిశుద్ధ్య కార్మికులతో శేరి సతీష్‌రెడ్డి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన చెత్త తరలించే ఆటో పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. పారిశుద్ధ్య కార్మికులు సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డిని కలిసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శేరి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరాభిమానాలు లభిస్తున్నాయని చెప్పారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ సారథ్యంలో నియోజకవర్గంలో పార్టీ బలోపేతం అవుతోందన్నారు. వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా నాయకులు, కార్యకర్తలు చేరుతున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎంపీగా గెలిపించి ఈ విజయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా అందజేస్తామని సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రానికి ప్రారంభిస్తున్న ఆవుల రవీందర్‌రెడ్డి తదితరులు

బాలానగర్: బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, తెలుగు రాష్ట్రాల ఓసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. కరుణాకర్‌రెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ప్రతి రోజు సుమారు 2 వేల మందికి మజ్జిగ, మంచినీరు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సభ్యులు ఆనంద్‌రెడ్డి, మండడి సుధాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దాసరి శంకర్‌రెడ్డి, సభాపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, కొత్త దామోదర్‌రెడ్డి, సులోచనరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌లను తొలగించండి



వాటర్ ప్లాంట్లను తొలగించాలని ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేసిన ఊట్ల చంద్రారెడ్డి, స్థానికులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని పాపిరెడ్డినగర్ బస్తీలో అక్రమ వాటర్ ప్లాంట్ల నిర్వహణతో బస్తీవాసులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని వాటర్ ప్లాంట్లను తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. సోమవారం బస్తీ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున స్థానికులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి వినతి పత్రం అందజేశారు. అరా, కొర వస్తున్న నీటిని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు తోడేస్తు సొమ్ము చేసుకుంటున్నారని, వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోయి నీటి కొరత ఏర్పడిందని వాపోయారు. నేడు బోరు వేయాలంటే సుమారు 1500 ఫీట్ల వరకు వేయాల్సి వస్తుంది. ఇప్పటికే బస్తీలో ఉన్న వాటర్ ప్లాంట్లకు తోడుగా రోడ్డు నెంబర్ 16 బ్లాక్ సిలో మరో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, సిహెచ్ రామకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వీరన్న, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, బస్తీ వాసులు పాల్గొన్నారు.

మండుటెండల్లో... చేపలు చనిపోకుండా..

పెంపకందారులకు జిల్లా మత్స్యశాఖ సూచనలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత కారణంగా నీరు క్రమేపి తగ్గటంతో ప్రాణవాయువు కొరత, నీటినాణ్యత తగ్గిపోయి చేపలు తీవ్రమైన ఒత్తిడికి గురై కొన్ని సందర్భాలలో చనిపోతుంటాయని జిల్లా మత్స్య శాఖ అధికారి పూర్ణిమా తెలిపారు. రోగకారక సూక్ష్మజీవులతో కూడా వ్యాధులు సంభవిస్తామయని తెలిపారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు పలు జాగ్రత్తలను పాటిస్తే.. ఆర్థిక నష్టం జరగదని ఆమె పేర్కొన్నారు. చెరువులోని నీటి నాణ్యత, లోతు, విస్తీర్ణం, చేపల కదలికలు ప్రతి రోజు గమనిస్తూ ఉండాలని తెలిపారు.

- చెరువులోని కొన్ని చేపలను మచ్చుకు పెట్టి వాటి పెరుగుదల, రంగు, తోక, రెక్కల స్వభావం, మొప్పెల రంగు, పై జిగురు లక్షణాలను నిశితంగా పరిశీలించాలన్నారు. ఇందులో తేడాలు గమనించిన ఎడల సంబంధిత మత్స్య శాఖ సూచనలు తీసుకొని నివారణ, నియంత్రణ చర్యలు సత్వరమే చేపట్టి ఆర్థిక నష్టాన్ని తగ్గించుకోవాలని సూచించారు.
- చెరువులో నీటి నాణ్యత తగ్గిపోయినప్పుడు సున్నం ఒక హెక్టారుకు 100 నుంచి 250 కిలోల వరకు చెరువులో చల్లినట్లయితే.. నీటి నాణ్యత పెరగడమే కాకుండా ప్రాణవాయువు శాతం పెరిగి, ఉదజని సూచికను అదుపులో ఉంటుందని తెలిపారు.
- చెరువులోని కలుపు మొక్కలని ఎప్పటికప్పుడు తగ్గిస్తూ ఉండాలని పూర్ణిమా పేర్కొన్నారు. లేని ఎడల రాత్రి సమయాలలో కేవలం కార్బన్ డయాక్సైడ్ విడుదల వల్ల చేపలు తీవ్ర ప్రాణవాయువు కొరతతో చనిపోతాయన్నారు.
- వ్యాధితో చేపలు చనిపోయినప్పుడు వెంటనే వాటిని తొలగించి చెరువుకు దూరంగా కాల్చివేయటమో లేదా ఒక గోతి తీసి అందులో పూడ్చి వేయటమో చేయాలన్నారు.
- ప్రాణవాయువు పెంచుకోవడానికి చెరువులోని నీటిని మోటార్ల ద్వారా రీసైక్లింగ్ చేస్తే.. విష వాయువు తగ్గి ప్రాణవాయువు శాతం పెరుగుతుందని పూర్ణిమా పేర్కొన్నారు.

సార్వత్రిక సమరం.. సిబ్బంది సిద్ధం

లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై ఈసీ ప్రత్యేక దృష్టి

- ఓటర్ల నమోదు మొదలు నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వరకూ సిబ్బంది పాత్రే కీలకం
- రిటర్నింగ్ అధికారిసహా సహాయ అధికారులు నియామకం



అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ కేంద్రాలు	
మేడ్చల్	591
మల్కాజిగిరి	418
కుత్బుల్లాపూర్	592
కూకట్‌పల్లి	417
ఉప్పల్	407
ఎల్బీనగర్	571
కంటోన్మెంట్	232
మొత్తం	3,228

సాక్షి,మేడ్చల్ జిల్లా: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్(ఈసీ) ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఓటరు నమోదు మొదలు అభ్యర్థుల నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి ఘట్టంలోనూ అధికారులు, ఎన్నికల సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తారు. వీరి ఎంపిక ప్రక్రియను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు... జిల్లా అధికార యంత్రాంగం కొన్నినెలల ముందే ప్రారంభించింది. ఎన్నికల సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా ఇటీవల కలెక్టర్ గౌతమ్ పూర్తిచేశారు.

మల్కాజిగిరి ఆర్‌ఓగా కలెక్టర్

శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)ని నియమిస్తోంది. ప్రతి లోక్‌సభ స్థానానికి సంబంధించి జిల్లా కలెక్టర్ ఆర్‌ఓగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆర్‌ఓగా వ్యవహరిస్తారు. నామినేషన్ ప్రక్రియ, అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన, పోలింగ్ సిబ్బంది నియామకం– శిక్షణ, ఈవీఎంల ర్యాండమైజేషన్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వంటి అంశాలన్నీ ఆర్‌ఓ పర్యవేక్షణలో జరుగుతాయి.

సహాయ రిటర్నింగ్ అధికారులుగా..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ఆర్‌ఓను ఎన్నికల సంఘం నియమించింది. అలాంటి వారందరూ లోక్‌సభ ఎన్నికల సమయంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఐదు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఐదుగురు ఆర్‌ఓలు... ఈ లోక్‌సభ ఎన్నికల సమయంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఎన్నికల నిర్వహణలో ఆర్‌ఓకు వారు సహకరించటంతో పాటు సంబంధిత శాసనసభ నియోజకవర్గాల పరిధిలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటారు. అయితే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఏడుగురు ఆర్‌ఓలు... ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఏఆర్‌ఓలుగా విధులు నిర్వహిస్తారు.

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం కానుంది. వీరి పరిధిలో 6 నుంచి 9 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, నీరు, విద్యుత్తు, ఫ్యాన్లు తదితర మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సెక్టోరియల్ అధికారులదే. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 313 సెక్టోరల్ అధికారులు విధులు నిర్వంచనున్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు సిబ్బంది

ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓ ప్రిసైడింగ్ అధికారి(పీఓ)ని నియమిస్తారు. ఈవీఎంలు, వీవీప్యాట్లను పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి.. ఓటింగ్ అనంతరం వాటిని స్ట్రాంగ్ రూంకు చేర్చే వరకు పీఓ బాధ్యత వహిస్తారు. సహాయకారిగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. వీరితోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు విధులు నిర్వర్తిస్తారు. ఒకరు ఓటర్లకు ఇంకు పూస్తారు. మరొకరు ఈవీఎంల పనితీరును పర్యవేక్షిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున సిబ్బందిని నియమిస్తూ... అదనంగా 20 శాతం మంది ఉద్యోగులను రిజర్వు ఉంచేలా ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు.

- మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి.

వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు

మూసాపేట: వేసవికాలంలో జరిగే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో గోడౌన్స్, కంపెనీలు,పరిశ్రమలు,పేపర్స్, బాటిల్స్ గోడౌన్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడౌన్స్, కంపెనీలు, భవనాల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక యంత్రాలు సమకూర్చుకోవాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రం, పోలీస్‌స్టేషన్, అత్యవసర సేవలకు తెలియజేయాలని, ఆలస్యం అయ్యే కొద్ది ప్రమాద తీవ్రత పెరుగుతుందని తెలిపారు. అగ్నిమాపక శాఖ సూచించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్, కేపీహెచ్‌బీ వెంకటేశ్వరరావు, బాచుపల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సమక్షంలో సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పీజేఆర్ నగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు సి.హెచ్. భాస్కర్ పార్టీలో చేరారు. భాస్కర్‌కు రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, అనిల్‌రెడ్డి, యాదగిరి, పోశెట్టి గౌడ్, మోజెస్, రవీందర్, బాలస్వామి సాగర్, రాజు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేక ఉత్సవాలు



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులతో ఊటుకూరి శ్రీనివాస్ గుప్తా

మోతీనగర్: ఆర్యవైశ్యులు వాసవీ మాతను పూజించటంతో సకల సౌభాగ్యాలు లభిస్తాయని ఐవీఎఫ్ నగర అధ్యక్షుడు ఊటుకూరు శ్రీనివాస్‌గుప్తా అన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో గత నెల 28వ తేదీ నుంచి కొనసాగుతున్న శ్రీచక్ర మేరు ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ సహిత మహా కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు సోమవారం ఆర్‌కే సొసైటీలోని ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు 108 కలశములచే కలశాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆకుతోట వితలయ్యగుప్తా, సుధాకర్‌గుప్తా, గౌరీ శంకర్‌గుప్తా, సురేష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, శంకరయ్యగుప్తా, లక్ష్మీనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఇఫ్తార్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని హస్మత్‌పేటలోని బడే మసీదులో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొని ముస్లింలతో కలిసి పండ్లు, ఫలహారాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, కూకట్‌పల్లి నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఏజాజ్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఇర్ఫాన్, ఖాదీర్, ఖాజా, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, మేకల హరినాథ్, దండుగుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఓటరు వివరాల కోసం..

కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ 1950



కలెక్టర్ గౌతమ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఓటరు వివరాల కోసం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో టోల్ ఫ్రీ నంబర్ '1950'ఏర్పాటు చేసినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.ఈ కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది, పోలింగ్ స్టేషన్ల నంబర్లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటరు వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫారం 6,7,8లపై సంక్షిప్త సమాచారం,ఓటర్ ఐడీ,పోలింగ్ స్టేషన్,ఎపిక్ కార్డు,ఏఆర్‌ఓ, ఈఆర్‌ఓ, బీఎల్‌ఓ, సూపర్‌వైజర్ల తదితర వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

నేడు బీజేపీ బూత్‌స్థాయి సమావేశం

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 2వ తేదీన సాయంత్రం 5గంటలకు షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ ఫంక్షన్‌హాల్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లతో పాటు రాష్ట్ర నాయకులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి అధ్యక్షులు, సభ్యులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరాయి.

కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 17, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జిమిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 19, బీన్స్ 45, క్యారెట్ 23, గోబిపువ్వు 18, దొండకాయ 23, చిక్కుడుకాయ 50, గోరుచిక్కుడు 23, బీట్‌రూట్ 19, క్యాప్సికం 65, ఆలుగడ 31, కీరా 21, దోసకాయ 16, సొరకాయ 9, పొట్లకాయ 18, కంద 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 20, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 40, ముల్లంగి 4 నుంచి 6, చిలగడ దుంప 18,గుమ్మడికాయ 40, నిమ్మకాయలు 55 నుంచి 60, మునగకాయలు 5 నుంచి 6, పచ్చిబఠాణి 57 లుగా ఉన్నాయి.

పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు





కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారితో బీజేపీ నేత మక్కాల నర్సింగ్‌రావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: పేదల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తున్నానని.. తన తండ్రి ఆశయాన్ని నేరవేర్చడమే తన ముందున్న లక్ష్యమని కూకట్‌పల్లి నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు మక్కాల నర్సింగ్‌రావు అన్నారు. పార్టీ పేరునే ఇంటిపేరుగా మార్చుకున్న తన తండ్రి బీజేపీ నర్సింహ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సాదురాం ఐ ఆస్పత్రి దోమల్‌గూడలో 15 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. అనంతరం మక్కాల నర్సింగ్‌రావు కుటుంబ సభ్యులు ఆపరేషన్లు చేయించుకున్న వారికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



మాధవరం కాంతారావును సన్మానిస్తున్న నార్లపురం శ్రీనివాస్, బీజేపీ నాయకులు

మోతీనగర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త అహర్నిశలు కృషి చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. ఇటీవల బీజేపీలో చేరిన నార్లపురం శ్రీనివాస్ తన మద్దతుదారులతో కలిసి మాధవరం కాంతారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యేవరకు ప్రతి ఒక్కరూ వీరోచితంగా పోరాడాలని సూచించారు. ప్రతి కార్యకర్తను స్వయంగా వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మోదీ దేశానికి చేసిన సేవలను వివరించాల్సిన అవసరం మనందరిపై ఉందని తెలిపారు. పార్టీలో చేరిన వారు పార్టీ ప్రతిష్ఠ, గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. నిరంతరం బీజేపీ ప్రజల సంక్షేమం కోరుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు నార్లపురం శ్రీనివాస్, గౌనెల సుదర్శన్ ముదిరాజ్, వెంకటేష్, యోగి, రవి గౌడ్, రవి మద్దిలేటి, గంగాధర్, రవి యాదవ్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, ధాన్యం కొనుగోళ్లపై పక్కా ప్రణాళిక

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌తో జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి,మేడ్చల్ జిల్లా: తాగునీటి సరఫరా, పాఠశాల మౌలిక వసతుల కల్పన, ధాన్యం కొనుగోళ్లపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో తగిన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లుతూ సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలతో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారితో ఆయన మాట్లాడారు. తాగునీటి సరఫరా విషయంలో మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల నేపథ్యంలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీఎంహెచ్‌వో డాక్టర్ రఘునాథస్వామి, మిషన్ భగీరథ ఈఈ సునీత, డీఈఓ విజయ కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ రానున్న 2 నెలల్లో పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని, ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులలో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను వినియోగించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని పేర్కొన్నారు.